● కొత్త రచయితలు

# నిర్ణయం

— ఆర్. ప్రణయప్రకాష్



"ఏంటే సుధా! ఇప్పటికి తీరిక దొరికిందన్నమాట నన్ను చూడ్డానికి! నీ స్వీట్ హార్ట్‌ను వదిలి రావాలంటే మన సొప్పటం లేదుకదూ?" అంది ప్రమీల.

"తీరిక దొరకక కాదు ప్రమీ—ఉక్కిరి బిక్కిరి చేసే సమస్యలు! మనశ్శాంతి లేక రాలేక పోయాను. ఇవ్వాళ నీ సాయం కోసం వచ్చాను" అంది సుధ. ఎంత దాచుకుందామన్నా దుఃఖం మాటల్లో, ముఖంలో కన్పిస్తూనే వుంది. ప్రమీల కాస్త కంగారు పడింది.

"ఏమైందే! ఏంటి నీ సమస్య? కనీసం ఉత్తరాలు కూడా రాయడం లేదు."

"ఉత్తరాలతో తేలే సమస్య కాదు. మీ నాన్న గారితో మాట్లాడి సుధాకర్ నుంచి విడాకులు తీసుకుందామనుకుంటున్నాను" అంది బాధగా సుధ.

"సుధా! అంత త్వరగా ఏ నిర్ణయమూ తీసుకోవద్దు. ముందు రిలాక్సవు. మాట్లాడుకుందాం. కాఫీ తెస్తాను. ఉండు, టిఫిన్ చేసావా లేదా?" అడిగింది ప్రమీల ఆప్యాయంగా.

ఆ లాలనకు గిర్రున కళ్ళ నీళ్ళు తిరిగాయి సుధకి.

ఇంతలో ప్రమీల నాన్న ఆదినారాయణ కోర్టుకు వెళ్ళేందుకు తయారయి వచ్చాడు. అతను మంచి లాయరని పేరు తెచ్చుకున్నాడు. ప్రాక్టీసు కూడా బాగానే వుంది.

కాఫీ తాగుతూండగా సంభాషణని కాలేజీ రోజుల వైపు మళ్ళించింది ప్రమీల. సుధ చాలా చలాకీగా, చదువులో కూడా చురుగ్గా వుండేది.

"నిరక్షరాస్యులు, అమాయకంగా, అవివేకంగా, చాదస్తాలతో, మూఢ నమ్మకాలతో ఒకరినొకరు అర్థం చేసు

కోలేక తన్నుకోడం, తిట్టుకోవడం చేస్తూ వుంటారు. జీవితాలు చేజేతులా నాశనం చేసుకుంటారు'' అని వాదించేది సుధ.

ప్రమీల మాత్రం ''సంస్కారం లేకపోతే ఎంత చదివినా లాభం లేదే సుధా! భార్యని అదీ ఉద్యోగం చేసే భార్యని కూడా వేధించుకుతినే భర్తలున్నారు మన సమాజంలో. కట్నం తేలేదని, తక్కువైందని కుటుంబం మొత్తం తన్నటం, తిట్టడం. అవసరమైతే కిరసనాయిలు పోసి తగలబెట్టడం జరుగుతోంది'' అని వాదించేది.

''ఆ ఆడవాళ్ళు కూడా నిర్లక్ష్యంగా మాట్లడ్డం, పర్దుకు పోయే గుణం లేకపోవడం, అవివేకంతో చికాకులు కొని తెచ్చుకుంటారు'' అనేది తను.

అలాంటి సుధ—జీవితాన్ని ఎంతో ప్రేమించి, తీర్చి దిద్దుకోగల వివేకం వున్న సుధ ఇలాంటి నిర్ణయం తీసుకోవడం ప్రమీలకు ఆశ్చర్యం కలిగించింది. అంతకు మించి బాధ పడింది. విషయం తండ్రికి చెప్పింది.

''అదేంటమ్మా పెండ్లయి ఆరు నెలలు కూడా కాలేదు—ఈ నిర్ణయం తీసుకున్నావు?'' అన్నాడు ఆదినారాయణ.

''లేదంకుల్! నరకంలో ఆరు నెలలు కాదుగదా, ఆరు రోజులు కూడా వుండలేరు ఎవరైనా. నా ఆశలన్నీ అడియాసలయ్యాయి. నా ఉద్దేశ్యాలన్నీ ఊహలయ్యాయి. అతన్తో ఇంక ఒక్క రోజు కూడా వుండలేను'' అంది కన్నీరు కారుస్తూ.

''అది సరేనమ్మా...నీ సమస్యలు క్లుప్తంగా చెప్పు. పరిష్కార మార్గం ఏదైనా వుంటుందేమో ప్రయత్నిద్దాం లేదంటే అప్పుడే ఆలోచిద్దాం'' అన్నాడు ఆదినారాయణ.

చెప్పటం ప్రారంభించింది సుధ.

* * *

''మీ కాలేజీలో లెక్చరర్ పోస్ట్ ఖాళీగా వుందట కదండీ. నేను ట్రై చెయ్యనా?'' అడిగింది సుధ.

''ఇప్పుడే నా మాట వినటం లేదు. ఆ ఉద్యోగం వస్తే నీకు కళ్ళు నెత్తికి వస్తాయి. ఇంట్లో పడుండు. మా అమ్మకు ఆరోగ్యం బాగా లేదు. వంట ఎవరు చేస్తారు?'' అన్నాడు సుధాకర్ విసురుగా.

''అదేంటండీ కాలేజీకి పొయ్యే లోపల వంట చేసి పోవచ్చు. అంతగా అయితే వంట మనిషిని పెట్టుకోవచ్చు. అందులో రమ తోడుగా వుంటుందికదా?'' అంది తోడికోడలు వుందన్న ఉద్దేశంతో.

''రమ వంట చేస్తుందా? వాళ్ళు ఎంత ఆస్తిపరులో తెలుసా? వాళ్ళ ఇంట్లో ఎంతో మంది పని మనుషులున్నారు. అలాంటి పిల్లతో పని చేయిస్తే మాటరాదూ'' అన్నాడు ఆమెను ఎంతో గొప్పదానిగా ఉద్దేశించి.

''వంట చేసి పోతానండి కాలేజీకి. చదివి ఊరికే వృధాగా వుండటం ఎందుకు? వచ్చే జీతం పోగొట్టుకోవడం ఎందుకు?''

''ఇప్పటికే నిన్ను కాపాడుకోలేక చస్తున్నా. ఇంక కాలేజీకి పోతే ఆ మగ లెక్చరర్లు మింగేసేలా నిన్ను చూస్తేంటే నాకు నచ్చదు'' అన్నాడు సుధాకర్.

''ఎవరు ఎలా చూస్తే మనకేంటండీ, మన బుద్ధి సరిగా వుండాలి కానీ...'' అంటుండగానే సుధాకర్ వెళ్ళిపోయాడు.

సాయంకాలం సుధాకర్ ఇంటికి వచ్చే సరికి అతని తమ్ముడి కోసం మామగారు మోటర్ బైక్ తెచ్చి పూజ చేయిస్తున్నాడు. ముందు సంతోష పడ్డాడు సుధాకర్. తర్వాత అసూయ, అవమానం తలెత్తాయి. తనకంటే చిన్నవాడు, చిన్న ఉద్యోగం చేసేవాడు అయిన సుమన్‌కు అల్లుడిగా ఎన్నో మర్యాదలు జరుగుతున్నాయి. తనకు మర్యాదలు జరగకపోగా మనశ్శాంతి లేకుండా పోతోంది అని బాధపడ్డాడు.

ఆదివారం కట్టగట్టుకుని నలుగురు లెక్చరర్లు వచ్చారు. సుధాకర్ అవసరమై బయటికి వెళ్ళాడు. భర్త వచ్చే వరకు సుధ వారితో మాట్లాడుతూ వుంది. బిస్కట్లు, కాఫీ ఇచ్చింది. అక్కడే వారితోనే కూర్చుని మాట్లాడుతోంది.

''మీది ఎం.ఎ. అయింది కదా, లెక్చరర్ పోస్టు ఖాళీగా వుంది ట్రై చెయ్యరాదూ, మేమంతా రికమెండ్ చేస్తాం'' అన్నారు ఆమె అభిమానం సంపాదించుకోవాలని.

''నాకూ ఇష్టంగానే వుందండి జాబ్ చెయ్యాలని! మా వారు వద్దంటున్నారు'' అంది మామూలుగా.

అప్పుడే లోపలికి అడుగు పెడుతున్న సుధాకర్ ఆ మాటలు విన్నాడు. మండిపోయాడు. 'తన కొలీగ్స్‌తో సమానంగా కూర్చుని మొగవాళ్ళు అన్న జ్ఞానం కూడా లేకుండా వాగుతోంది.

బాగా చదివానన్న అహంకారం' అనుకున్నాడు. తను ఉద్యోగం చెయ్యొద్దన్నాడని వాళ్ళతో ఫిర్యాదు చేస్తోంది. వీళ్ళంతా తనను వప్పిస్తే ఈవిడగారు ఉద్యోగం చెయ్యాలనా! ఈ లెక్చరర్స్ అంతా సంస్కార హీనులు, స్టూడెంట్స్‌తోనే రొమాన్సు జరపాలని ప్రయత్నించేవాళ్ళు...వీళ్ళ మధ్య తన భార్య జాబ్ చేస్తే! మరి ఊహించలేక పోయాడు. 'అయినా ఆ పోస్టు కోసం పాతిక వేలు డొనేషన్ అడిగారు. హిస్టరీ విష్ణువర్ధనరావు బావమరిది, ఇంగ్లీషు డిపార్ట్‌మెంట్ రత్నప్రకాష్ తమ్ముడు ఆ పోస్ట్‌కి సరిపోతారని తెలిసీ ఆ డబ్బులు కట్టడానికి ఇష్టంలేక మానుకున్నారు. అలాంటిది సుధ కోసం రికమెండ్ చేస్తారట. ఎందుకు? ఈమె అందం చూసి ఎర వేయడానికి! వెధవలు!!' అని మనసులో అనుకున్నాడు. అతను ముభావంగా వుండటంతో వారు వెళ్ళిపోయారు.

''ఏంటీ అంతగా మర్యాదలు చేసావు—వాళ్ళేమైనా నీ స్నేహితులా, బంధువులా?'' వాళ్ళటు వెళ్ళగానే అన్నాడు కోపంగా.

''అదేంటండి, మీ స్నేహితులు, మీతోపాటు పనిచేస్తున్నారు. మీ కోసం వస్తే 'లేరు పొండి'' అంటే ఏం సంస్కారం! మర్యాదేముంది—ఉత్తి కాఫీ బిస్కట్లేకదా!'' అంది ఆశ్చర్యంగా.

''నా కోసమా? కాదే నీ కోసం, ఇది వరకూ ఎన్నడూ నా యింటికి వారు రాలేదు. నువ్వింటికి వచ్చాకే నిన్ను చూసి పోదామని వస్తున్నారు. నువ్వేమో చూడరమ్మా అంటూ అందరికీ మర్యాదలు చేస్తూ నీ అందాన్ని ప్రదర్శిస్తున్నావు. ఈసారెప్పుడు ఎవరొచ్చినా ఇలాంటివి జరిగాయంటే కాళ్ళు విరగ్గొడ్తాను. పో లోపలికి'' అంటూ దూషించాడు.

సుధ మనసు చివుక్కుమంది. అంత చులకనగా తన భర్త తనను మాటలు అనెయ్యగలడని ఊహించ లేదు. 'అతను కోపంలో వున్నాడు.

ఇప్పుడు ఏమన్నా అతన్ని రెచ్చగొట్టినట్లవుతుంది'

అని మౌనంగా లోనికి నడిచింది.

రాత్రి పడుకో బోయే ముందు, ''నీ తోడికోడలు భర్త కోసం మోటార్ సైకిల్ తెప్పించింది. నువ్వు నా కోసం మీ నాన్న నడిగి మోటార్ సైకిల్ తెప్పించు'' అన్నాడు సుధాకర్.

సుధ మనసు అపాయం శంకిం

## భాగస్వామి

చిక్కి శిథిలమై జీర్ణావస్థలో వున్నా నా
హృదయాన్ని చిగురింపచేసిన నా నేస్తమా!
ఎండిబీటలు వారిన నా మనసుకు రతనాల
పంటగా తీర్చిదిద్దిన నా ప్రియతమా!
మోడువారిన నా జీవితంలో వసంతం
తెచ్చిన నా ప్రాణమా!
ఏమిచ్చి నీ ఋణం తీర్చుకోగలను?
నా భాగస్వామిగా చేసుకోవడం తప్ప

— ఎస్.కృష్ణ, ఇల్లందు




బాపు ముఖచిత్రం

తాజాసంచిక చూశారా?

**15 అతి మంచి కథలు: సీరియల్**

ఈ నెల ప్రత్యేక కానుక

కాబోయే కథకులకు పనికొచ్చే చిట్కాలు

మల్లాది వెంకటకృష్ణమూర్తి; ఎన్.ఆర్. నంది; హైమా భార్గవ్; "???"; ముఖ్రవ్; వసుంధర; అవసరాల రామకృష్ణారావు; ఘండికోట బ్రహ్మాజీరావు తదితరుల శీర్షికలే కాక మరెన్నో బహుమతులందించే శీర్షికలు! ఇంకా ప్రత్యేక రచనలు, కవితలు, కార్టూన్లు .... మరెన్నో!!!

**128 పేజీలు: రు. 10 మాత్రమే!**

సంవత్సర చందా : రు. 120/-

ఏజెన్సీ లేని ఊళ్ళలో ఏజెన్సీ వివరాలకు సంప్రదించండి

రచన సచిత్ర మాస పత్రిక

పోస్ట్‌బాక్స్ నెం.:33 విశాఖపట్నం-530 001

ఏంది. ఇలాంటి ప్రసక్తి వస్తుందని ఊహించింది ముందే. అయినా మృదువుగా చెప్పింది.

"వారు ఆస్తిపరులు—తేగలరు! మా నాన్నకంత స్తోమత లేదు. నేను ఉద్యోగంలో చేరతాను. ఆ జీతం తీసి పెట్టి తెచ్చుకుందాం" అంది సుధ.

"మా సుమన్‌కు కట్నం ఎంతిచ్చారో తెలుసా? లక్ష రూపాయలు! ఇంక మర్యాదలు ఎప్పుడూ జరుగుతుండేవే. నీ బాబులాగ దరిద్రుడు కాదు వాడి మామ" క్రోధంగా అన్నాడు సుధాకర్.

సుధ సహించలేక పోయింది. "ఎవరికోసం ఇస్తారండీ. అమ్మాయి నల్లగా వుంది, చదువు... సంధ్యలు లేవు! ఎవరూ చేసుకోక పోతే ఇవ్వకేం చేస్తారు?" అంది అందరూ అనుకున్నవి విని కానీ...ఈ మాటలకు అతడు అంత ఉగ్రుడవుతాడని ఊహించలేకపోయింది.

"నువ్వు అప్సరసవని తక్కువ కట్నమైనా చేసుకుంటారే! నీకు ఉద్యోగం కూడా ఇప్పిస్తారె— డొనేషన్ అవసరం లేదు, లంచం అవసరం లేదు—అందం వుంది కదా అందుకే! నీ అందం చూసుకునే నీకింత పొగరు" అంటూ ఊహించని విధంగా ఆ చెంప ఈ చెంప వాయించాడు. కాలితో, చేతులతో తన్నాడు. ఆమె నిశ్చేష్ట అయింది. ప్రతిఘటించటానికి కూడా వీలులేక పోయింది. మనసంతా మండిపోతున్నా, కళ్ళ నీళ్ళు తిరుగుతున్నా నిగ్రహించుకుని ఆ అవమానాన్ని మౌనంగా భరించింది.

మోటర్ సైకిల్ కోసం పదిసార్లు పుట్టింటికి వెళ్ళింది సుధ. ఎన్నిమార్లో అతడు సిగరెట్‌తో చెంపల మీద, చేతుల మీద, పొట్ట మీద కన్పించే చోట్ల కాల్చాడు. ఎంతగానో నచ్చచెప్పి చూసింది. తండ్రికి చెప్పి బతిమాలింది. "ఆయన కోరికలు తీర్చాల్సిన అవసరం లేదు. కనీసం నన్ను కొద్ది రోజులు మీ ఇంట్లో వుంచుకోండి నాన్నా. ప్రశాంతంగా వుంటాను. లేకుంటే పిచ్చెక్కుతుంది. తర్వాత పెళ్ళి చేసుకుంటాను, ఉద్యోగం చూసుకుంటానంటే వీలలేదు" అన్నా విన్పించుకోలేదు తండ్రి.

"ఇప్పటికి పెళ్ళయి ఆరు నెలలు. ఈ ఆరునెలల్లో ఇరవయి సార్లు వచ్చావు. ఊర్లో అందరూ ఏమంటున్నారో తెలుసా? నీ తర్వాత చెల్లెలి పెళ్ళి కావాలి. మీ అన్నయ్యకు పెళ్ళి చేయాలి. పెద్ద కూతురు మొగుడ్ని వదిలేసిందంటే మా పరువేంకావాలి! తర్వాత వాళ్ళ పెళ్ళిళ్ళు ఎలా చెయ్యాలంటావ్! చావైనా బతుకైనా పెళ్ళయింతర్వాత ఆడపిల్లకు అత్తిల్లే!" అన్నారు.

అలాంట పరిస్థితి! పుట్టినింట్లో ఆదరణ లేదు. అత్తింట్లో నరకం. ఆత్మహత్యే శరణ్యం అనుకుంది. 'కానీ, తన తప్పేం లేదు. ' తను ఎందుకు చావాలి? పరువు కోసం పుట్టింటి వాళ్ళు వద్దన్నారు. కోరికలు తీర్చలేదని ఒక వైపు అత్తవారు హింసలు పెడితే ఏం చెయ్యాలి! ఎక్కడికి వెళ్ళాలి? ఆడపిల్లకు అత్తిల్లు—పుట్టిల్లు లేకపోతే జీవితం లేదా' అనుకుంది సుధ. అందుకే తన స్నేహితురాలైన ప్రమీల తండ్రి లాయరు కాబట్టి ఆమె ఇంటికి వచ్చింది.

* * *

"అంతా విన్నారు కదా అంకుల్ ఇప్పుడు చెప్పండి మీ సలహా పాటిస్తాను" అని అడిగింది సుధ.

"నీ నిర్ణయం కరెక్టేనమ్మా! ఇంత చదివీ, ఉద్యోగం చేసుకునే అవకాశం ఉండీ, వారు పెట్టే హింసలకు బలైపోమ్మని ఎలా చెబుతాను! అలాంటి అనుమానం మనిషికి ఎంత డబ్బిచ్చినా ఎన్ని కానుకలిచ్చినా లాభం లేదు. నీకు విడాకులిప్పిస్తాను. ఉద్యోగ ప్రయత్నం చేద్దువుగాని. మెల్లిగా స్థిమిత పడ్డాక నీ గురించి తెలుసుకుని ఎవరైనా పెళ్ళి చేసుకుంటానంటే నేనే చేస్తాను. అంత వరకూ నాకు మరో కూతురిగా నా యింట్లోనే వుండమ్మా!" అన్నాడు ఆదినారాయణ.

"థాంక్యూ అంకుల్. ఈ మాత్రం ఆసరా ఇస్తే బతగ్గలను ప్రశాంతంగా. ఇన్ని రోజులు మన శ్శాంతి లేకుండా బతికాను. ఈ నిర్ణయం తీసుకున్నాకే నాకు కాస్త ప్రశాంతత లభించింది" అంది సుధ.

*